
# ఏప్రిల్ ఫూల్



—గుడిసేవ సుందరరామయ్య

"అయ్యమ్మా! నీ కోసం ఎవరో వచ్చారు" అన్న పార్వతి మాటలు విన్పించగానే బియ్యంలో రాళ్ళు ఏరుతున్న పోలమ్మ ఉలిక్కిపడి లేచింది.

తడికె తలుపును త్రోసుకొని బయటకు వెళ్ళి చుట్టూ చూసింది పోలమ్మ.

ఎవరూ కన్పడలేదు.

"ఏప్రిల్ ఫూల్! అయ్యమ్మ ఏప్రిల్ ఫూల్!" అంటూ ఆనందంతో చప్పట్లు చరిచింది పదేళ్ల పార్వతి.

"ఏమిటే యిదంతా?" విసుగ్గా అడిగింది పోలమ్మ.

"ఈ రోజు ఏప్రిల్ ఫస్టు! ఏదైనా తమాషా చేసి అందర్ని ఫూల్ చేయాలని మా ఫ్రెండు లక్ష్మి చెప్పింది."

"నువ్వు యిస్కూల్లో నేర్చుకొంటున్న పాటాలు యియ్యేనంటే పిల్లా?" గదిమింది పోలమ్మ.

"కోప్పడకు అయ్యమ్మా! ఈ రోజు ఏప్రిల్ ఫూల్ అయిన వాళ్ళు కోపగించుకోకూడదు! సరదాగా తీసుకోవాలి. నువ్వు కూడా ఈ రోజు ఎవరినైనా ఫూల్‌ను చేయి చూద్దాం?" అంది పార్వతి రివ్వున లోపలికి పరిగెత్తుతూ.

పోలమ్మకు అంతా చోద్యంగా వుంది. ఈనాటి పిల్లలకు చిన్న వయసులోనే బుర్ర నిండా తెలివి తేటలు. నోటి నిండా కబుర్లు. దేవుడు ఎందుకిస్తున్నాడో అర్థం కాలేదు పోలమ్మకు. తన కాలం నాటికి ఈ కాలంనాటికి ఎంత తేడా! లోకం ఎంతలో ఎంత మారిపోయింది?

ఆలోచిస్తూ లోపలికి వెళ్ళిన పోలమ్మ పుస్తకాలు సర్దుకొంటున్న పార్వతిని చూసి "ఒసే పారూ! నీకోసం ఆ లచ్చమ్మ వొచ్చింది!" అంది.

పార్వతి నవ్వింది.

"ఏమిటే అలా నవ్వుతావ్?"

"నాకు తెల్సు అయ్యమ్మా! నన్ను ఫూల్‌ను చేద్దామనుకొంటున్నావ్ కదూ! ఈ టైమ్‌లో లక్ష్మి ఎంచక్కా వాళ్ళ నాన్నగారి కారెక్కి స్కూలుకు వెళ్తుంది. కాని మనింటికి వస్తుందా?" అంది పార్వతి పుస్తకాల సంచీని భుజాన తగించుకొంటూ.

"నీకు సానా తెలివి తేట లున్నాయే తల్లీ!" అంటూ బియ్యపు చాటను దగ్గరకు తీసుకొంది పోలమ్మ.

"అయ్యమ్మా! నువ్వు చాలామందికి క్యారేజీలు తీసుకెళ్తావుగా! సాయంత్రం లోగా వాళ్ళతో ఒకరినైనా ఫూల్‌ను చేయి చూద్దాం!" అంటూ తడికె తలుపును తీసుకొని బయటకు పరిగెత్తింది పార్వతి.

* * *

సూర్యుడు నడినెత్తి మీదికి వచ్చాడు.

అప్పటికే చాలామందికి క్యారేజీలు యిచ్చేసింది పోలమ్మ.

తలమీదవున్న తట్టలో రెండు క్యారేజీలు మాత్రమే వున్నాయి.

తట్టదించుకొని రెండు క్యారేజీలవైపు చూసింది.

అందులో ఒక క్యారేజి ఇన్సూరెన్సు కంపెనీలో పనిచేస్తున్న ప్రసాద్‌ది. మరొకటి బ్యాంకులో పనిచేస్తున్న భాస్కరానిది. వాళ్ళిద్దరి ఆఫీసులు ప్రక్క ప్రక్కనే.

ఊరికి కొంచెం దూరంగా వుండటంచేత అందరికీ క్యారేజీలు యిచ్చాక ఆఖరుకు ఈ ప్రాంతానికి రావటం పోలమ్మకు అలవాటు. పైగా వాళ్ళిద్దరూ స్నేహితులని చాలా మంచివాళ్ళని పోలమ్మకు తెల్సు.

క్యారేజీలు తీసుకువెళ్ళటంలో ఆలస్యం అయితే పల్లెత్తుమాట అనరు సరికదా "పోలమ్మా! క్యారేజీలో కూరలు మిగిలి పోయాయి! మీ మనవరాలికి పెట్టు!" అని ఎంతో ఆప్యాయతను కురిపిస్తారు.

తన మనవరాలి గురించి వాళ్ళందరికీ తనే సెప్పింది. అలా సెప్పకోటంలో తన కెంతో తృప్తి. అయిదేళ్ళ క్రితం తన కొడుకు, కోడలుకూలిపని సేత్తు, గోడకూలి సచ్చిపోయారు. అప్పట్నుంచీ దాని బాగోగు లన్నీతనేసూసుకొంటూవొస్తోంది. ఎడతెరిపి లేకుండా వసపిట్టలా అది కబుర్లు సెబుతూంటే ఎంతో ముచ్చటవుద్ది!

అందరూ దాన్ని వదిలించుకున్నారు. ఒకటో కలాసులో యిస్కూల్లో యేసింది తను. ఏటా ప్రతి కలాసు పాసయి పోతుంది అది. ఆరో కలాసుకు వచ్చేసింది. దాని తెలివితేటలు రోజురోజుకూ లావయి పోతున్నాయి. తను కూడా ఎవరినైనా ఫూలును సేయాలంట!

ముసిలిదాన్ని! సదువులేనిదాన్ని? నేనెవరిని సేత్తాను ఫూలును?

ఏదో తమాషాచేసి ఫూలును చేయాలంట! సాయంకాలం లోపు. సేయమని యిస్కూలుకు యెల్తూ యెల్తూ సెప్పి పోయిందా గుంట? తమాషా అంటే ఏం సేయాలి? ఆలోచిస్తూ నడుస్తున్న పోలమ్మ బుర్రలో తళుక్కున ఓ ఉపాయం మెరిసింది.

గబగబ ఎదురుగావున్న ఇన్సూరెన్సు కంపెనీలోకి వెళ్ళింది.

* * *

పోలమ్మయిచ్చిన క్యారేజీని అందుకొని డైనింగ్ రూమ్‌లోకి వెళ్ళాడు ప్రసాద్.

అప్పటికేతోటి మిత్రులంతా భోజనాలు చేస్తున్నారు. మంచినీళ్ళ గ్లాసు తెచ్చుకొని టేబుల్‌మీద పెట్టుకొని ఉత్సాహంగా క్యారేజీ విప్పాడు ప్రసాద్.

అందులో వున్న పదార్థాలను చూడగానే అతనికి శ్రీమతి మీద అంతులేని అభిమానం పుట్టుకొచ్చింది. ప్రొద్దున్నే మొదలుకొని ఆఫీసుకు వచ్చేవరకు తను శ్రీమతిగారిని కనీసం పాతికసార్లయినా ఏప్రిల్ ఫూల్ చేశాడు. ఆవిడ కూడా తనను ఫూల్ చేయాలని ఎన్నో రకాలుగా ప్రయత్నించింది. కాని విఫలురాలైంది. అందుచేత తను ఆఫీసుకు వచ్చేముందు తన మామూలు (ముద్దు) కూడా ఇవ్వటానికి నిరాకరించింది. ఏమిటో ఆడవాళ్ళ అంతరంగం ఆ దేవుడి క్కూడా అర్థం కాదు. తన మీద కోపం పెంచుకోకుండా

అనురాగాన్ని. ఆప్యాయతను మేళవించి రుచికరమైన పిండివంటలు. కూరలు తయారుచేసి పంపినందుకు ఎంతో పొంగిపోయాడు ప్రసాద్. తనకు దేవత లాంటి భార్యను కుదిర్చిపెట్టిన పెళ్ళిళ్ళ పేరయ్యశాస్త్రిగారి స్వరూపాన్ని (వారిప్పుడు కీర్తిశేషులు) మనసులో స్మరించు కొని శత కోటి వందనాలు సమర్పించు కొంటూ భోజనానికి ఉపక్రమించాడు ప్రసాద్.

* * *

పోలమ్మ క్యారేజీ తెచ్చిందని ప్యూన్ చెప్పేసరికి ప్రాణం లేచివచ్చినట్లయింది భాస్కరానికి. ప్రొద్దున్నుంచీ 'టీ' కూడా త్రాగనీయకుండా ఎరియర్స్ వర్క్ చేయిస్తున్నాడు మేనేజర్. ఫోంచేసి వస్తానని చెప్పి మేనేజర్ కేబిన్‌లోంచి బయట పడ్డాడు భాస్కర్.

భాస్కర్ భోజన ప్రియుడు. కంటి కింపుగా రెండు కూరలు. ఓ పులుసు రెండు పచ్చళ్ళు లేనిదే అతనికి భోజనం చేసినట్టు వుండదు. అతని అదృష్టంకొద్దీ వంట వార్పు బాగా తెల్సిన శాయి కుమారి అతనికి భార్య అయింది. భర్త టేస్ట్ తెల్సింది కావటంచేత రోజుకో రకంగా కూరలను చేసి అతని ప్రశంసలను పొందుతూంది శాయి. పెళ్ళయిన వారం రోజులకే భాస్కర్ తన భార్య వంట చాలా బాగా చేస్తుందని సర్టిఫికెట్ యిచ్చేశాడు. రోజూ తింటున్న భోజనమే అయినా ఆమె చేతివంట భాస్కరానికి నిత్య నూతనంగా వుంటుంది. అందుచేతనే ప్రతిరోజూ క్యారేజీ రాగానే ఎంతో ఆతృతతో. ఆశతో క్యారేజీని విప్పి చూస్తాడు.

కడుపులో ఆకలి ఎక్కువ కావటంచేత డైనింగ్ హాల్లోకి వెళ్ళకుండా తన టేబుల్ మీదనే క్యారేజీ విప్పి చూశాడు భాస్కర్.

ఆశ్చర్యం!

మొదటి గిన్నె కాళీగా వుంది!

రెండో గిన్నె కాళీ!!

మూడో గిన్నె కాళీ!!!

నాల్గో గిన్నె కాళీగా లేదు.

అందులో ఓ చిన్న చీటీ వుంది.

మెల్లగా చీటీని చేతిలోకి తీసికొని విప్పి చూసాడు. అందులో ఇలా వుంది....

"ఏప్రిల్ ఫూల్!"

* * *

"నేను కూడా యిద్దరు మడుసుల్ని ఫూలుస్‌ను చేశానే పిల్లా!" అంది పోలమ్మ ముసి ముసిగా నవ్వుతూ.

"నిజంగానా అయ్యమ్మా! ఎలా చేశావో చెప్పవూ?" ఆత్రంగా అడిగింది పార్వతి.

"యియ్యాల మద్దినాల కారేజీ లిచ్చాక చివరికి తట్టలో రెండు మిగిలాయి. రెండూ ఒకేరకంగా వున్నాయి. అయినా ఏది యెవరిదో నాకు యెరుకే ననుకో! నేనేం తమాషా సేశానో తెలుసా? ఒకరి కేరేజీ మరొకరికి యిచ్చేశాను!"

"బలే బలే! అయ్యమ్మా! ఈ సంగతి వాళ్ళకు తెల్సి కేకలేస్తే ఏం చేస్తావ్?" చటుక్కున అడిగింది పార్వతి.

"పొరపాటు జరిగిపోయింది బాబూ అంటాను!" అనేసి చెవి ప్రక్కనున్న చుట్టపీకను బయటకు తీసింది పోలమ్మ.


జ్యోతిచిత్ర

సూపర్‌స్టార్ - హీరో '84

ఫిలిం బ్యాలెట్

- గడచిన సంవత్సరాలలో వలెనే "జ్యోతిచిత్ర" ఈ సంవత్సరం కూడా "సూపర్ స్టార్ – హీరో '84" ఫిలిం బ్యాలెట్‌ను నిర్వహిస్తున్నది.
- లక్షలాది పాఠకులు, హీరోల అభిమానులు సమధికోత్సాహంతో విరివిగా పాల్గొంటున్న యీ ఫిలిం బ్యాలెట్ కూపన్ పత్రాలు 'జ్యోతిచిత్ర'లో గత 4 వారాలుగా ప్రచురితమవుతున్నాయి.
- ఫిలిం బ్యాలెట్ గడువు ముగింపునకు మరి రెండు వారాల వ్యవధి మాత్రమే ఉన్నది. ఈ పోటీలో పాల్గొనదలచిన ఉత్సాహవంతులు 'జ్యోతిచిత్ర'లో యిందుకు సంబంధించి ప్రచురిస్తున్న కూపన్‌లను విధిగా ఉపయోగించాలి.
- పోస్టు కార్డులు, ఇన్‌లాండ్ కవర్లు, యితరత్రా తెల్ల కాగితాలపై వ్రాసినవి అంగీకరించబడవు.
- 1985 ఏప్రిల్ 5, ఏప్రిల్ 12 తేదీలు గల 'జ్యోతిచిత్ర' సంచికలలో యీ ఫిలిం బ్యాలెట్ పత్రాలు ముద్రించబడుతున్నాయి. ఆ రెండు సంచికలతో "సూపర్‌స్టార్ హీరో '84" బ్యాలెట్ గడువు ముగుస్తుంది. అంచేత యీ బ్యాలెట్‌లో పాల్గొనదలచిన వారంతా 'జ్యోతిచిత్ర'లోని కూపన్‌లను పూర్తి చేసి పంపవలసిందిగా కోరుతున్నాం.

BHASKAR